నల్లగొండ నమూనా

పాలనా భాషగా తెలుగు



నందివెలుగు ముక్తేశ్వరరావు ఐ.ఎ.ఎస్.

జిల్లా కలెక్టర్, నల్లగొండ

'పాలనా భాషగా తెలుగు' పై జూన్ 7, 2013న

నల్లగొండ టి.టి.డి.సి. భవనంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు



రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు శ్రీ మండలి బుద్ధప్రసాద్, నల్లగొండ జిల్లా కలెక్టర్ శ్రీ నందివెలుగు ముక్తేశ్వర రావు ఐ.ఎ.ఎస్., మరియు సదస్సులో పాల్గొన్న వివిధ జిల్లాల రెవెన్యూ అధికారులు, జిల్లా అధికారులు.

Nalgonda Namuna
Pālanā Bhāshagā Telugu
by **N. Mukteśwar Rao** I.A.S., Collector, Nalgonda Dist. A.P.

© : **ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం**

మొదటి ముద్రణ : జూన్, 2013

ప్రతులు : 2000

వెల : అమూల్యం

పుస్తకాలకు:
ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం
314, దక్షిణ 'హెచ్' భవనం
2వ అంతస్తు, ఆంధ్రప్రదేశ్ సచివాలయం,
హైదరాబాద్ - 500 022.

లేదా

జిల్లా కలెక్టర్,
కలెక్టర్ కార్యాలయం
నల్లగొండ జిల్లా.

ముద్రణ :
సాయిలిఖిత ప్రింటర్స్
ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.
ఫోన్ : 040-65545979

నల్లగొండ నమూనా

పాలనా భాషగా తెలుగు

నందివెలుగు ముక్తేశ్వరరావు ఐ.ఎ.ఎస్.

జిల్లా కలెక్టర్, నల్లగొండ

ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం

హైదరాబాద్



నందివెలుగు ముక్తేశ్వరరావు నల్లగొండ జిల్లా కలెక్టర్. మంచి సాహితీప్రియులు. నల్లగొండ కవులు, రచయితలకు ఎంతో ఆప్తులు. ప్రజా సమస్యలను ఎంత చిత్తశుద్ధితో పరిష్కరిస్తున్నారో అంతే చిత్తశుద్ధితో నల్లగొండ సాహిత్యరంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. జిల్లాను పట్టి పీడిస్తున్న ఫ్లోరిన్ సమస్యపై ఆయన చేసిన, చేస్తున్న కృషి వెలకట్టలేనిది. పాలనా భాషగా తెలుగును సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఆయన కృషిని రాష్ట్ర అధికార భాషా సంఘం గుర్తించింది. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ కలెక్టర్ బహుమతిని అందుకున్నారు. ప్రజలకు తెలిసిన భాషలో పాలన సాగించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని విశ్వసించే ప్రజల కలెక్టర్ నందివెలుగు ముక్తేశ్వరరావు.

ఇలా అమలు చేశాం

మండలి బుద్ధప్రసాద్
అధ్యక్షులు,
ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

314, దక్షిణ 'హెచ్' భవనం,
2వ అంతస్తు, ఆంధ్రప్రదేశ్ సచివాలయం,
హైదరాబాద్ - 500 022.
ఫోన్ : 040-23453214 (కార్య)
08671-272056 (కార్య)

ప్రశంస

ఏకాలంలోనైనా, ఏదేశంలోనైనా 'ప్రజల భాషలోనే పాలన' అన్నది చరిత్ర చెపుతున్న సత్యం. పూర్వం మన దేశంలో సంస్కృత, ప్రాకృత భాషలు రాజభాషలుగా చెలామణిలో ఉన్నప్పుడు కూడా పాలకులు దేశభాషల్లోనే ప్రజలతో నిత్యవ్యవహారాలు జరిపినట్లు చారిత్రకాధారాలున్నాయి. ప్రస్తుతం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది అనివార్యమైన అంశంగా గుర్తించబడింది. మన దేశ స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ వారు కూడా మన దేశంలోని ఆయా ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యమిచ్చారు. అప్పుడే పరిపాలన సుగమమవుతుందని విశ్వసించారు. ఆచరించి చూపారు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం కూడా ఆయా ప్రాంతీయ భాషలకు ప్రాముఖ్యం కల్పించడం వల్లనే మన దేశంలోని అనేక రాష్ట్రాలు ఆయా ప్రాంతాలలోని భాషలను అధికార భాషలుగా గుర్తించి, పాలనా వ్యవహారాలను ఆయా భాషలలోనే కొనసాగిస్తూ అభివృద్ధి పథంలో సాగిపోవడం మనం గమనిస్తూనే ఉన్నాం.

ఆ దిశగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెలుగు భాష పరిస్థితిని పరిశీలిస్తే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగును రాష్ట్ర అధికార భాషగా ప్రకటిస్తూ 1966 మే 14వ తేదీన చట్టబద్ధం చేసింది. దీని అమలు పరిశీలన కోసం సుమారు 40 ఏళ్ల క్రితమే అధికార భాషా సంఘం ఏర్పాటయింది. అయినప్పటికీ పరిపాలనా భాషగా తెలుగు అమలులో అనుకున్నంత ప్రగతిని మనం సాధించలేకపోయాం. ఇప్పుడు ఇందుకు కారణాలు వెతుక్కోవటం కంటే కార్యాచరణ ప్రణాళికలను పటిష్టం చేసుకొని వాటిని పాటించడం మేలు.

ప్రభుత్వ స్థాయిలో ఏ పనికైనా చట్టబద్ధత అవసరమే అయినప్పటికీ దానితో పాటు నిబద్ధత, నిమగ్నత, చిత్తశుద్ధి చాలా అవసరం. ఇవి లోపించినందువల్లనే మనం అనుకున్నంత ముందుకు వెళ్లలేక పోయామేమోననిపిస్తుంది. మన సమాజంలో నిరక్షరాస్యుల శాతం అధికం, గ్రామీణ ప్రాంతాలు ఎక్కువ. అందువల్ల ప్రభుత్వం ఈ రెండింటి అభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరిస్తుంది. అందుకు 'ప్రజల భాషలో పాలన అన్నది' అత్యంక కీలకమైన పాత్రను పోషిస్తుంది. అట్టడుగు ప్రజలు నిత్యం తమను చుట్టుముట్టే సమస్యలను ప్రభుత్వ యంత్రాంగంతో విన్నవించుకోవడానికి వారికి తెలిసిన భాషయే వ్యక్తీకరణ మాధ్యమమవుతుంది. అటువంటప్పుడు ప్రభుత్వం కూడ ఈ సమస్యల పరిష్కారంలో తన స్పందనను గానీ, వారి కోసం చేపట్టిన సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులను వారికి తెలియజేయడంలో గానీ వారికి తెలిసిన భాషలోనే కొనసాగిస్తే వారికి ఆ ప్రభుత్వం పట్ల సంపూర్ణమైన విశ్వాసం ఏర్పడుతుంది. ప్రజా సమూహం ప్రభుత్వానికి చేరువవుతుంది. పరిపాలనలో పారదర్శకత చోటు చేసుకొంటుంది. ప్రజలు ప్రభుత్వం మధ్యనున్న తెరలు పొరలు తొలగిపోతాయి. ప్రజలు నిర్భయంగా, నిస్సంకోచంగా తమ గోడును వినిపించుకోవడానికి ఆస్కారం కలుగుతుంది. అందుకే ప్రజల భాషలో పాలన అన్నది ప్రభుత్వం విజయాలకు తొలిమెట్టు వంటిది.

ప్రస్తుతం మన రాష్ట్రంలోని పరిస్థితిని గమనిస్తే మండల స్థాయిలో, తాలూకా స్థాయిలో, జిల్లా స్థాయిలో, సచివాలయ స్థాయిలో అధికార భాషగా తెలుగు అమలు పూర్తి స్థాయిలో జరగడం లేదు. అందుకు తగిన ఉపకరణాలు తెలుగులో అందుబాటులో లేవని, పరిపాలనా సంబంధమైన పారిభాషిక పదజాలానికి సరిఅయిన నిఘంటువులు, పదకోశాలు తగిన రీతిలో తయారు కాలేదని, ఉద్యోగులకు భాషామెళకువలలో సరియైన శిక్షణ ఇచ్చే సదుపాయాలు లేవని ఇట్లా అనేక కారణాలు చెప్పే అధికారులే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఏదో నెపంతో దోషాన్ని అవతలి వారిపై నెట్టి వేయడం తప్ప ఇందులో నిజం లేదు. శ్రద్ధాసక్తులు, ఆత్మాభిమానాన్ని చాటే భాషాభిమానం కొరవడిందే తప్ప మరొకటి కాదు. ఒకవేళ అదే నిజమైతే ఈనాడు నల్లగొండ జిల్లా పాలనా భాషగా తెలుగు అమలులో నూటికి నూరు శాతం విజయాన్ని సాధించడం సాధ్యమయ్యేదా అని ప్రశ్నించుకోవాలి. అప్పుడు దొరికే సమాధానం

ప్రజల దగ్గరకు పరిపాలనను తీసుకొని వెళ్లడంలో చిత్తశుద్ధి, నిబద్ధత, నిమగ్నత, నిజాయతీ ముఖ్యమే గానీ, పై కుంటి సాకులు కాదన్నది స్పష్టమవుతుంది.

ఈ చిత్తశుద్ధి, నిజాయితీ అన్నవి ప్రస్తుత ప్రభుత్వ వ్యవహారశైలిలో మనకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మాన్య ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి పాలనా భాషగా తెలుగు అమలును వారి కార్యాలయం నుంచే మొదలు పెట్టారు. దస్త్రం తెలుగులో వస్తేనే దాన్ని పరిశీలిస్తున్నారు. దీనివల్ల తెలుగు అమలు పట్ల వారి నిబద్ధత ఏమిటో మనకు అర్థమవుతుంది. ఇటీవల వారి పూనిక వల్ల జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు తెలుగు భాష పట్ల తెలుగు ప్రజలను చైతన్య పరిచాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రింది స్థాయి నుంచి పైస్థాయి దాకా పాలనా భాషగా తెలుగు అమలు కోసం జారీ అయిన వారి ఆదేశాలు ఖచ్చితంగా పాటించబడేందుకు వారు చొరవ చూపుతున్నారు.

వారి ఆకాంక్ష మేరకు నల్లగొండలో ప్రభుత్వ యంత్రాంగంలోని అన్ని శాఖలలో పాలనా వ్యవహారాలు తెలుగులోనే పూర్తి స్థాయిలో జరుగుతున్నాయి. బాగా నలిగిన ఇంగ్లీషు మాటలలో చెప్పాలంటే నోటు ఫైళ్లు, ప్రొసీడింగులు, మెమోలు, ఛార్జిషీట్లు, వివిధ రకాల దరఖాస్తులు, ఉత్తర ప్రత్యుత్తరాలు అన్ని తెలుగులోనే నడుపుతున్నారు. క్రింది స్థాయి ఉద్యోగి నుంచి పైస్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరు దీనిని ఒక సవాలుగా తీసుకొని అత్యంత ఉత్సాహంగా దీని నిర్వహణలో పాల్గొని కృతకృత్యులవుతున్నారు. మనసే ఉంటే మార్గం లేదా అన్నట్లు సాంకేతిక, పారిభాషిక పదాలకు తెలుగు సమానార్థకాలను ఆయా స్థాయిలలోని ఉద్యోగులే పదపరికల్పన చేసుకొని, వాటికి ప్రామాణికతకు నిర్ధారించుకొని అమలులో పెడుతున్నారు. నమూనా పత్రాలను, పదకోశాలను, సమానార్థక పట్టికలను స్వయంగా రూపొందించుకుంటున్నారు. దీనిలో ఎంతో సౌకర్యాన్ని, సౌలభ్యాన్ని పొందుతున్నారు. కనీసం ఇన్నేళ్ల తరువాతనైనా ముఖ్యమంత్రి ఆకాంక్ష మేరకు ఒక జిల్లాలో పూర్తి స్థాయిలో పాలనా భాషగా తెలుగు అమలు అవుతున్నందుకు సంతోషించడంతో పాటు మిగతా జిల్లాల అధికారులు దీనిని ఆదర్శంగా తీసుకొని అమలు బాటలో అడుగులు వడివడిగా వేయాలి.

అయితే ఇక్కడ తెలుగు ఇంత బాగా అమలు కావడానికి కలెక్టర్ శ్రీ ముక్తేశ్వరరావు ఒక చోదక శక్తిగా పనిచేశారు. అదే స్ఫూర్తిని అందిపుచ్చుకొని ఇతర అధికారులు, ఉద్యోగులు కూడా పై అధికారి ఆదేశాలను మొక్కుబడిగా పాటించడం కాకుండా ఇది మన భాష అనీ, తమ పాలన ప్రజలకు చేరువ కావడంలో ఇది ప్రధాన సాధనమనీ గుర్తించి తమ విధుల నిర్వహణలో మమేకమై పనిచేయడం వల్ల ఇది సాధ్యమైందని చెప్పవచ్చు.

శ్రీ ముక్తేశ్వరరావు తెలుగువాడు కావడం వల్ల, కేవలం తెలుగు భాష మీద ఆయనకు ఉన్న అభిమానం వల్లనే ఇది సాధ్యమైందని చెప్పడం కంటే, ప్రజల భాషలో పాలన అన్నది అతిముఖ్యమైనదిగా ఆయన భావించడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. ఆయన మాదిరిగా ఇతర అధికారులు కూడా ఇట్లా భావించినట్లయితే ఇది సుసాధ్యమే అని శ్రీ ముక్తేశ్వరరావు నిరూపించారు. ఇక్కడ భాషాభిమానంతో పాటు పరిపాలనలో ప్రజలకు చేరువై వారి అవసరాలను తీర్చడంలో కృతకృత్యులు కావాలనే దృఢసంకల్పం ప్రధానమైంది. దాని పర్యవసానంగానే రూపొందిన 'నల్లగొండ నమూనా- పాలనా భాషగా తెలుగు' అనే పుస్తకం ఈనాడు వెలుగులోకి వచ్చింది. ఇది జిల్లా అధికారులకు తెలుగు అమలులో ఆదర్శం కావాలి. స్ఫూర్తిని అందించాలి. జిల్లాలో తెలుగు అమలులో, ఈ పుస్తక రూపకల్పనలో ప్రధాన భూమికను పోషించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ శ్రీ ముక్తేశ్వరరావు, సంయుక్త కలెక్టర్ డాక్టర్ హరిజవహర్‌లాల్, అదనపు సంయుక్త కలెక్టర్ శ్రీ నీలకంఠం, ఇతర అధికారులు, ఉద్యోగులు, ప్రతి ఒక్కరు సదా అభినందనీయులు.

ప్రజాస్వామ్యానికి స్ఫూర్తి

ప్రజాస్వామ్యంలో ప్రజలు చైతన్యవంతంగా పాల్గొనాలంటే... వాళ్లు మాట్లాడే భాష పాలకులు మాట్లాడే భాష ఒకటి కావాలి. పాలకులకు వేరే భాష మాట్లాడడానికి అవకాశం లేదు. రాచరిక వ్యవస్థలో రాజు భాష ప్రజలు మాట్లాడారు. రాజు భాషే ప్రజల భాష.

కానీ ప్రజాస్వామిక యుగంలో పాలితుల భాష పాలకుల భాష కావాలి. కాకపోతే అది ప్రజాస్వామ్యం కాదు. ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధం కూడా.

అలాగే పాలనా రంగాన్ని పరిశీలించినట్లయితే... ఒకప్పుడు మన నైజాం ప్రాంతంలో ఉర్దూ... లేకపోతే ఇంగ్లీషు వాళ్లు ఉన్నపుడు కూడా కోర్టుల్లో పాలన వ్యవహారాల్లో కొంత వరకు తెలుగు ఉండేది.

ఉదాహరణకు 1884లో వచ్చినటువంటి భూసేకరణ చట్టంలో నోటీసులు మొదలైనవి తెలుగులో ఉన్నాయి. అంటే దాదాపు 120, 130 సంవత్సరాల కింద చేసినటువంటి చట్టాలు. ఆ చట్టాల్లో కూడా తెలుగులో నోటీసులు ఇవ్వాలని ఉంది.

అలానే తెలుగులో ఒకప్పుడు ప్లీడర్లు ఉండేవారు. ప్లీడింగ్స్ చేసేవాళ్లు. కోర్టుల్లో కూడా ఇలాంటివి అనేక రకాలైనటువంటి సదుపాయాలు ఉండేవి. రాను రాను తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు మనకు మనవాళ్లు వచ్చిన తర్వాత... తెల్లవాళ్లు పోయి నల్లవాళ్ల పరిపాలన వచ్చిన తరువాత మన పాలనా వ్యవహారాల్లో ఇంగ్లీషు ఎక్కువగా వాడటం మొదలు పెట్టాము.

భాష అనేది ప్రజలకు, పాలకులకు సన్నిహితం చేయడానికి కలసిమెలసి పనిచేయడానికి ఒక అవకాశాన్ని ఇస్తుంది.

అదే రకంగా భాష పరభాష అయ్యేటట్లు అయితే మన భాష కాకుండా ఉన్నట్లయితే అది మన మధ్య దూరానికి అంతరానికి కూడా కారణమవుతుంది.

దూరం ఉన్న అంతరం ఉన్న పరిపాలన కావాలా? దూరం లేని అంతరం లేని పరిపాలన కావాలా? అనేది మన ముందు ఉన్నటువంటి ప్రశ్న. దూరం లేని అంతరం లేని పరిపాలన ఉండాలనేది నా ఆంతర్యం.

అదే రకంగా మనకు అధికారం అంటే పరిపాలనా భాషగా ఏది ఉండాలి అని పేర్కొనడానికి కూడా మనకు ఓ చట్టం ఉంది.

అధికార భాషా చట్టం ఉన్నది. ఆ చట్టం ఏం పేర్కొంటుంది అంటే తెలుగును ప్రథమ అధికార భాషగాను, ఉర్దూను ద్వితీయ అధికార భాష గాను పేర్కొంటోంది. ఆ అధికార భాష చట్టరీత్యా మనం వీటిని మాత్రమే మనం అఫిషియల్ లాంగ్వేజీలు అంటే అధికార భాషలుగా పేర్కొనాలి.

అధికార భాషలో మాత్రమే ప్రొసీడింగ్స్ మొత్తం ఉండాలి అని చెపుతున్నా కూడా మనం తీసికెళ్లి వేరే భాషలో రాస్తున్నాము. అంటే ఏమిటి మనం చట్టానికి కూడా వ్యతిరేకంగా పని చేస్తున్నామని చెప్పాలి.

ఇంగ్లీషులో రాసేందుకు అధికారం లేదు మనకు. పాలనా వ్యవహారంలో ఇంగ్లీషు రాస్తే తప్పు. ఎవరైనా మనల అడగవచ్చును. ఇంగ్లీషులో ఎందుకు రాశారు, ఇంగ్లీషు తీర్పు ఎందుకు చెప్పారు అని అడిగితే మనం దానికి జవాబుదారిగా ఉండాల్సిన అవసరం ఉంది.

కాబట్టి చట్టరీత్యా కూడా మనం పని చేయాల్సిన అవసరముంది.

ప్రజలు వాళ్లకు తెలిసిన భాషలోనే పరిపాలించబడాలని కోరుకుంటారు. కాబట్టి ప్రజల భాషలోనే పాలన సాగించాలి.

జిల్లా ఉత్సవాలు ప్రేరణ కలిగించాయి

నల్లగొండ జిల్లాలో పానగల్లు ఉత్సవాలు, ఆ తర్వాత తెలుగు మహాసభల సన్నాహక సమావేశాలు ఘనంగా జరుపుకున్నాము. ఈ రెండు ఉత్సవాలు కూడా గొప్ప స్ఫూర్తితో ఉత్సాహంతో జరుపుకున్నాము. ఈ ఉత్సవాల్లో ప్రజలు, విద్యార్థులు, కవులు, కళాకారులు, అధికారులు పాల్గొన్నారు. జిల్లా సంస్కృతిని ప్రతిబింబించే కళలను ప్రదర్శించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు జిల్లాకు సంబంధించిన విషయాలను ఉపన్యాసాల రూపంలో ప్రజలకు చెప్పారు.

తెలుగు మహా సభల్లో కూడా ఎక్కువ మంది పాల్గొన్నారు. స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ప్రేమతో పాల్గొన్నారు. ఇది ఈ ఉత్సవాల్లో గొప్పవిషయం.

ఈ ఉత్సవాలు జరుపుకుంటున్నప్పుడు చాలా విషయాలు ప్రస్తావనకు వచ్చాయి. అనేక విషయాలు గుర్తుకొచ్చాయి. మనకి ఇన్ని కళారూపాలు ఉన్నాయి, ఇంత సంస్కృతి ఉన్నది, ఇంత చైతన్యం ఉన్నది అనేది నెమరువేసుకున్నాము. చాలా సందర్భాల్లో ఆగి ఆలోచించుకోవడానికి అవకాశం దొరికింది.

ఆ తరుణంలో ఎక్కువ మంది వ్యక్తం చేసిన అభిప్రాయం ఏమిటంటే మన భాష సంస్కృతి సాహిత్య విషయాలు కనుమరుగు అవుతున్నాయి అని. ఒక ఆవేదనతో కూడినటువంటి విషయాన్ని వ్యక్తం చేశారు.

మన సంస్కృతి, భాష ఎందుకు కనుమరుగు అవుతున్నాయి. ఎందుకు ఇలా జరుగుతోంది? ఏ పరిస్థితులు దీనికి కారణం? ఈ విషయాలను ఆలోచించి నప్పుడు మనకు మరింత ఆవేదన కలుగుతుంది.

ఇది ఇలా జరగడానికి కారణం ఏమిటి అని ఆలోచించుకున్నపుడు మనకు ముఖ్యంగా భాష మీదికి దృష్టి వెళుతుంది.

భాష వాడుతున్న తీరును బట్టి ప్రాథమికంగా రెండు రకాలుగా విభజించవచ్చు.

ఒకటి : మన ప్రజాజీవితంలో ఉండేటటువంటి భాష.

రెండవది: వ్యక్తిగత కుటుంబ జీవితంలో ఉండే భాష.

ఒకప్పుడు కుటుంబ జీవితంలో కుటుంబ అవసరాలకోసం సరిపడ భాష ఉండేది. అదే భాష ప్రజాజీవితంలో కూడా ఉండేది. ఇవాళ పరిస్థితులు మారినాయి. అన్ని రంగాల్లో చదువు సంధ్యలు పెరిగాయి. అనేక రంగాలు విస్తరించాయి. ముఖ్యంగా విద్యారంగం, పాలనా రంగం. ఇవి రెండు కూడా చాలా విస్తృతమైనవి.. ఒకప్పుడు అంటే 1950లో 10, 15 శాఖలతో ప్రభుత్వం నడిచేది. కానీ ఇవాళ దాదాపు 80 శాఖలు పని చేస్తున్నాయి. అంటే శాఖలు పెరిగాయి.

అలాగే ప్రభుత్వ శాఖలు కూడా పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నాయి. వేల మందితో అనునిత్యం సంబంధబాంధవ్యాలు నిర్వహించాల్సి వస్తోంది. అయితే ఈ సంబంధ బాంధవ్యాలు ఎక్కువగా ఆంగ్లంలో నిర్వహిస్తున్నారు.

అలాగే ఆనాడు నల్లగొండలో ఒకటి రెండు హైస్కూళ్లు మాత్రమే నడిచాయి. ఒకప్పుడు అంటే 50, 60 ఏండ్ల కిందట. ఇప్పుడు దాదాపు 100, 150 పెద్ద పెద్ద విద్యా సంస్థలు పనిచేస్తున్నాయి. ప్రైవేటు స్కూళ్లలో నైతేనేమి పబ్లిక్ స్కూళ్లలో నైతేనేమి ఇవాళ కొన్నివేల మంది పిల్లలు చదువుకుంటున్నారు. అయితే విద్యార్థులు ఇంగ్లీషును మాట్లాడాలి అనే కఠినమైన నిబంధనను అమలవుతున్నాయి. దీని వల్ల ఆంగ్ల మాధ్యమంలో నేర్చుకుంటున్నారు. విద్యార్థులు మాతృభాషయిన తెలుగును మర్చిపోయే టటువంటి పరిస్థితి ఏర్పడింది.

మాతృభాషలో మాట్లాడలేకపోవడం అనే దుస్థితి ఏర్పడ్డది. ఈ విషయాన్ని చర్చకు తీసుకురావడానికి ముందు ఒక విషయం గుర్తు చేసుకోవాలి. ఇంగ్లీషులో మాత్రమే మాట్లాడేటటువంటి వాతావరణంలో ఇంగ్లీషు మాధ్యమంలో ఇంగ్లీషు నేర్చుకోవడం అనేది విద్యార్థులకు తప్పని సరి అగత్యంగా పరిణమించింది.

అంటే దాదాపు ఒక తరం... ముందు తరం మొత్తం కూడా ఇంగ్లీషులో ఉన్నది. 1975, 80 నుంచి తీసుకున్నట్లయితే దాదాపు ఒక తరం వచ్చేసింది. ఆ తరం పూర్తిగా ఇంగ్లీషు మాత్రమే నేర్చుకున్నది. ఎల్‌కెజి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు అంటే కెజి టు పిజి వరకు కూడా ఇంగ్లీషులో చదువుకునే తరం ఒకటి వచ్చేసింది.

అందువల్ల మనం మన మాతృభాషకు దూరమవుతున్నాము. మన సంస్కృతికి దూరమవుతున్నాము.

మన సంస్కృతిని, మన భాషను మనం ఎలా కాపాడుకోవాలి. ఎలా అంటే ఆ భాషను మనం విరివిగా వాడడం వల్ల. ఇంటి సంబంధ విషయాలలోనే కాకుండా, అధికారిక విషయాల్లో కూడా మనం మన భాషను వాడుకోవాలి. దీని వల్ల ప్రజలకు కూడా ఎంతో మేలు జరుగుతుంది.

ఈ ఆలోచన వచ్చిన తర్వాత ఇక పాలనలో ఎందుకు మనం ప్రజల భాషను అంటే ఇక్కడ తెలుగును ఉపయోగించకూడదు అనిపించింది.

ఇక తెలుగులోనే పాలన సాగించాలని నిర్ణయించాను.



పానగల్లు ఉత్సవాలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ముక్తేశ్వరరావు

అధికారులతో ఆలోచన పంచుకున్నాను

ఇప్పుడు ఉన్న పరిస్థితి ఏమిటంటే... ఒక సాధారణమైనటువంటి రైతుకు లేక సాధారణమైనటువంటి ఒక ముసలి అవ్వకు ఇచ్చే పింఛన్ పేపర్లతో సహా అన్నీ కూడా మనం ఇంగ్లీషులోనే ఇస్తున్నాం. అలాగే మీటింగులు అన్నీ కూడా ఇంగ్లీషులోనే నిర్వహిస్తున్నాము. మీటింగుకు సంబంధించిన మినిట్స్ కూడా ఇంగ్లీషులోనే రికార్డు చేస్తున్నాము. సభలు సమావేశాలు తీర్మానాలు కూడా ఇంగ్లీషులోనే చేస్తున్నాము.

అంటే ఎక్కడ చూసినా కూడా ఇంగ్లీషు మయం. దాని వల్ల మేలు జరుగుతుందా కీడు జరుగుతుందా ఆలోచించాలి. నాకు తెలిసి ఏదో కొద్ది మంది అధికారులకు లేదా సిబ్బందికి మాత్రం సౌకర్యంగా ఉంటుంది. అదీ మొదటి నుంచి ఇంగ్లీషు భాషకు అలవాటు పడినవారికి. ముఖ్యంగా తెలుగు మాతృభాష కాని వాళ్లకు కొంత సౌకర్యంగా ఉండవచ్చు.

అయితే ఈ పద్ధతి వల్ల, ఇలా ఆంగ్లంలో పాలనా వ్యవహారాలు నిర్వహించడం వల్ల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందా ఆలోచించాలి. నా వరకు నాకు ఉండదనే నమ్ముతాను. ప్రజలు అసౌకర్యానికి గురవుతారు. పైగా ఇబ్బంది పడతారు.

మొత్తం లెక్క తీసుకునేటట్లయితే ఆంధ్రప్రదేశ్‌లో జనాభా ఇవాళ ఎనిమిదిన్నర కోట్లు. ఈ జన సంఖ్యలో ఇంగ్లీషు నేర్చుకున్నవాళ్ల సంఖ్య చాలా తక్కువుంటుంది. ఇంగ్లీషు వచ్చిన వాళ్ల సంఖ్య చాలా తక్కువ ఉంటది. మరి పాలనలో ఇంగ్లీషు ఉంటే ప్రజలకు ఎలా చేరుతుంది.

మన రాష్ట్రంలో తెలుగు నేర్చుకున్న వాళ్ళనే తీసుకుంటే ప్రతి ముగ్గురిలో ఒకరికి తెలుగు రాదు. అక్షరాలే కాదు ప్రతి ముగ్గురిలో ఒకరు నిరక్షరాస్యులే. ఈ పరిస్థితుల్లో కేవలం ఇంగ్లీషు మీదనే పరిపాలన చేయాలనుకోవడం ఎంత వరకు సమంజసం. ఆంగ్ల భాషలోనే మొత్తం కార్యవ్యవహారాలన్నీ నిర్వహించాలనుకోవడం ఎంత వరకు సబబు. ఇది పూర్తిగా తప్పు, అశాస్త్రీయం.

ఇలాంటి పరిస్థితుల్లో నా ఆలోచనను అధికారులతో పంచుకున్నాను. ప్రజలకు సౌకర్యవంతమైన, వారి మాతృభాష అయిన తెలుగులోనే పాలనా వ్యవహారాలు నిర్వహించాలని చెప్పాను.

ఈ సందర్భంలో చాలా మంది ఒక విషయాన్ని అంటుంటారు. ఏమని అంటే కలెక్టరుకు తెలుగు అంటే ఇష్టం. తెలుగు భాష మీద ఆయనకు ప్రేమ. కాబట్టి పాలనలో తెలుగు భాషను అమలు చేస్తున్నారు అని. అయితే తెలుగు భాషను పాలనలో అమలు చేయడానికి కారణం ఈ విషయం కాదు. ఇది భాషాభివృద్ధికి, భాష మీద అభిమానానికి, ప్రేమకు సంబంధించిన విషయం కాదు. ప్రజల సౌకర్యం, అవసరానికి సంబంధించిన విషయం. ఈ ఆలోచనతో పాలనా భాషగా తెలుగును అమలు చేస్తున్నాము.

పాలన కోసం మళ్లీ తెలుగును తీసుకొస్తున్నాము కాబట్టి మనకు తెలుగంటే అభిమానమనీ అనుకునే ప్రమాదముంది. అయితే ఇది భాషాభిమానానికి సంబంధించిన విషయం కాదు. ఇది ప్రజలకు సంబంధించిన విషయం. నేను నా ప్రజలను ప్రేమిస్తున్నానా లేదా అనటానికి గుర్తు. తెలుగులో అని కాదు ప్రజలకు అర్థమయ్యే భాషలో మాట్లాడాలనేది ముఖ్యం.

నేను ఒక వేళ తమిళనాడు కేడర్ ఐఏఎస్ అధికారిని అయ్యి ఉంటే తమిళంలోనే మాట్లాడేవాణ్ణి. తమిళంలోనే పాలన చేసేవాణ్ణి. అలాగే ఒరిస్సాలో ఉన్నట్లయితే ఒరియా భాషలోనే నేను పాలన చేసేవాడిని.

దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్నాడు గురజాడ. దేశమును ప్రేమించుమన్నా అంటే మనుషులను ప్రేమించమని అర్థం. మన ప్రజలను మనం ప్రేమిస్తున్నామా, వాళ్లను అక్కున చేర్చుకుంటున్నామా అనేది ప్రధానం.

భాష అనేది ప్రజలకు సంబందించిన ఒక వస్తువు. అది ప్రజలకు సంబంధించినదై ఉండాలనేది నా అభిప్రాయం. పాలకుల, పాలితుల భాష వేరైతే వారి మధ్య అంతరం పెరుగుతుంది. ప్రజలకు తెలియని భాషలో ఏ వ్యవహారం సంబంధించినది కాదు అని సవినయంగా మనవిచేస్తున్నాను. ప్రజాభిమానానికి సంబంధించిన విషయంగా నేను మనస్ఫూర్తిగా భావిస్తున్నాను.

ఇక్కడ పరిపాలించేటటువంటి ప్రజల మీద అభిమానం, ప్రేమ ఉండేటట్లయితే వాళ్ల భాషను మనం ప్రేమించాలి. ప్రజల నుడికారంలో మనం మాట్లాడాలి. ప్రజల భాషలో పాలన సాగించాలి. వాళ్లతో కలిసి తిరగాలి. అప్పుడు మాత్రమే పరిపాలన సత్ఫలితాలను ఇస్తుంది అని నేను నమ్ముతున్నాను.

భాష దూరమైతె ఎలా ఉంటుంది అనేది రెండవ ప్రశ్న. భాష దూరమైతే సత్ఫలితాలు ఇవ్వవు సరికదా గందరగోళానికి దారితీసే పరిస్థితులు ఏర్పడతాయి.

భాష దూరం కావడం వలన చాలా సందర్భాల్లో అంటే ఆఫీసుల్లో కాని లేకపోతే ఇతర ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లో కాని కరప్షన్ పెరగటానికి గాని లేకపోతే బ్రోకర్లు పెరగటానికి గాని అవకాశముంటుంది.

ఈ బ్రోకర్లు సామాన్య ప్రజల బలహీనతలను ఆసరా చేసుకొని లబ్ధిపొందాలని చూస్తారు. ఇంగ్లీషులో పాలన సాగించినట్లయితే.... నీకు ఈ విషయాలు అర్థం



అధికారులతో కలెక్టర్ ముక్తేశ్వరరావు

కావు. చాలా కష్టంగా ఉంటుంది. క్లిష్టమైన పరిస్థితులు ఉంటాయని చెప్పి బ్రోకర్లు ప్రజలను గందరగోళ పర్చుతారు. ఆందోళనకు గురిచేస్తారు. కాబట్టి ఇంత కష్టమైన పనిని తాము చేసి సహకరిస్తామని ప్రజలకు చెప్పుతారు. ఇలా ప్రజలను తీసుకొచ్చి పనిచేసిపెట్టే ఒక వర్గం తయారవుతుంది.

అదే ప్రజలకు తెలిసిన భాషలో ప్రభుత్వ వ్యవహారాలు ఉండేటట్లయితే ప్రజలే స్వయంగా అర్థం చేసుకోగలుగుతారు. ఇది తప్పు, ఇది ఒప్పు అని వాళ్లు అధికారులను కూడా అడగటానికి వీలవుతుంది.

అంటే తమకు సబంధించిన విషయాలను ప్రజలు ఎవరి మీద అధార పడకుండా అర్థం చేసుకుంటారు. వారికి న్యాయంగా దక్కాల్సిన విషయాలను వారు అడిగి మరీ తీసుకోగలుగుతారు. ఎవరి చేతుల్లోనో మోసపోవడానికి అవకాశం ఉండదు. అంటే ప్రజలకు న్యాయం జరుగుతుంది.

ఈ విషయాలను నేను అధికారులతో చర్చించాను. మా జిల్లా అధికారులు ఎంతో సంతోషంగా అంగీకరించారు. ఇక తెలుగులోనే పాలన సాగించాలని తలపెట్టాము.

సమస్యలు అధిగమించాము

అధికారులతో నేను నా ఆలోచనను పంచుకున్నప్పుడు అందరూ అంగీకరించారు. అదే సమయంలో వాళ్ల భయాందోళనలను కూడా చెప్పారు. అంటే మరేమీ కాదు. తెలుగును పాలనలో అమలు చేయడానికి ఎదురయ్యే సమస్యలు. వాటిని కూడా చర్చించాము. సమస్యలను అధిగమించడానికి ప్రణాళికను తయారు చేసుకున్నాము.

చాలా మంది అధికారులు వ్యక్తం చేసినటువంటి భయసందేహాలు ఏంటంటే ప్రభుత్వ పాలనా విషయాలు తెలుగులో రాయడానికి మనకు తెలుగు భాషా పదాలు లేవు కదా అని. అంటే ముఖ్యంగా సాంకేతిక పదాలు. ఇంగ్లీషులో ఇంత కాలం పాలనా వ్యవహారాలు నిర్వహించాము కాబట్టి వారికి ఆ సమస్య వచ్చింది.

దానికి నేను చెప్పింది ఏందంటే ఇవ్వాళ అంతరిక్షం దగ్గర నుంచి ప్రపంచంలో జరిగేటటువంటి ప్రముఖ సంఘటనల వరకు పత్రికలు రాస్తున్నాయి. మీడియా రంగంలో ఎన్నో అంశాలు పాత్రికేయులు గొప్పగా వివరించగలుగుతున్నారు. జూనియర్ జర్నలిస్టులు కూడా ఎంతో సమర్థవంతగా రాస్తున్నారు. అంతకు ముందు వారికి తెలియని పదాలను సృష్టించుకుంటున్నారు. మరి మనం ఎందుకు మన అవసరాలను అనుగుణంగా తెలుగు పదాలను తయారు చేసుకోలేము.మనసుంటే ఇది అసాధ్యమేమీ కాదని చెప్పాను.

ఇట్లా తెలుగును ఉపయోగించడం వల్ల చట్ట పరమైనటువంటి సమస్యలు వస్తాయి అని మరో భయం. అసలు చట్టపరమైనటువంటి సమస్యలు పరిపాలనలో ఉండనే ఉండవు. అయితే సమస్యలు వచ్చే ఒకటి రెండు సందర్భాలలో జాగ్రత్తగా ఉండాలి. సమస్యలు వస్తాయని అసలు ప్రారంభించకుండా ఉండలేము కదా.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి విషయాలు ఎక్కువగా వాడుతాము. ఉదాహరణకు : నీకు ఎసైన్‌మెంట్ ఇస్తున్న... అని చెపుతారు. దీంట్లో చట్టపరమైన సమస్య ఏముంటుంది.

నేను అనుకోవడము ఏమిటంటే చట్టపరమైన సమస్యలు అనుకున్నంత లేనే లేవు. కాబట్టి దాన్ని గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదు.

ఇక మరో సమస్య సాంకేతికంగా పదజాలం లేదు అని. నా అభిప్రాయం ఏమిటంటే పదజాలం చాలా వరకు మనకు ఉన్నది. మనకు చాలా కాలం కిందటే అంటే మూడు దశాబ్దాల కిందటే తెలుగు అకాడమి వారు పరిపాలనా న్యాయ పదకోశము పేరుతో పరిపాలన పదకోశము, న్యాయ పదకోశము కలిపి చాలా చక్కని పదకోశాన్నే తయారు చేశారు. కాబట్టి అలాంటి పుస్తకాలను మనం ఉపయోగించుకోవచ్చు.

ఆ తర్వాత తెలుగు అకాడమీ వారు టెక్ట్‌బుక్స్ చేస్తున్నపుడు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ హిస్టరి ఆంత్రోపాలజి సైకాలజీ ఈ పుస్తకాలన్నింటిని కలిపి వాటికి సంబంధించి నటువంటి అనేక పదాలకు పదకోశాలు తయారు చేసి మనకు అందించారు. కాబట్టి మనకు పదకోశం కొరత లేదు. ఈ సమస్యల వల్ల మనం తెలుగు పాలనలో అమలు చేయడం లేము అనేది సరియైనది కాదు.

ఆఖరిగా నేను అధికారులతో చెప్పినటువంటి అంశం ఏందంటే... పదకోశాల సహాయం తీసుకొని మీరు తెలుగు రాస్తున్నా ఇంకా మీకు కావలిసిన తెలుగు పదాలు దొరకలేదు అనుకుందాము. అక్కడ మీకు కష్టము భారము అనిపిస్తుంది. మరేం ఫరావాలేదు. ఆంగ్ల పదాలను తెలుగులో రాయండి. మీకు సరియైన తెలుగు పదం తెలిసేంత వరకు ఈ పద్ధలోరాయండి అని చెప్పాను.

ఉదాహరణకు :

This file is circulated for favour of information.

లేదా

This file is submitted for favour of information

అని మీరు చెప్పదలుచుకుంటే

మీకు సమాచార నిమిత్తము ఈ దస్త్రము సమర్పించబడినది అని రాయండి. అది కూడా సమయానికి గుర్తుకు రాకపోతే

ఇన్‌ఫర్మేషన్ నిమిత్తము ఫైల్ సబ్మిట్ చేయడమైనది

అని కూడా రాసుకొమ్మని చెప్పాను. మరెట్లా రాసినా కూడా ఫరవాలేదు. తప్పులు రాసినా కూడా ఫరవాలేదు. తప్పులు రాస్తే కూడా నాదే బాధ్యత. మీరు మాత్రం రాయాలి అని చెప్పిన.

ఆంగ్ల పదాలను అయినా సరే తెలుగులో రాయమని ఎందుకు చెప్పాను అంటే తెలుగులో రాయడమనేది అలవాటు కావాలి. తెలుగు పదాలు దొరకలేదు కదా అని ఆంగ్లంలో రాస్తే అదే అలవాటు అవుతుంది. మరి మన లక్ష్యం ఎలా నెరవేరుతుంది. అందుకని ఈ సలహా ఇచ్చాను.

ఎక్కువ మంది అధికారులు స్ఫూర్తిగా తీసుకున్నారు. వాళ్ళ వాళ్ళ ఆఫీసుల్లో సమావేశం పెట్టుకున్నారు. వాళ్ల కార్యాలయానికి సంబంధించిన మినిస్టీరియల్ స్టాఫ్ అంటే ఫైళ్లు పెట్టేవాళ్ల నుంచి సూపరింటెండెంటు, డిప్యూటీ తహశీల్దారు... ఆ క్యాడరు వరకు ఉన్నటువంటి ఆఫీసర్లే కాకుండా టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు సీనియర్ అసిస్టెంట్లు... అందరితో కూడా సమావేశాలు నిర్వహించుకున్నారు.

సమావేశంలో వాళ్లందరు కూడా మొదట కొంచెం తటపటాయించినా కూడా ఎక్కువ మంది స్వాగతించారు. ఎందుకంటే ఎక్కువ మందికి ఇంగ్లీషులో వాళ్ల వాళ్ల భావాలను వ్యక్తం చేయడానికి సరిపోయినంత పదకోశం లేదు. ఏదో పదికట్టు పదాలు ఒకరిద్దరికి వొచ్చి ఉంటే ఆ ఒకరిద్దరు మాత్రమే మహారాజులుగా చెలామణి అవుతున్నారు. తక్కిన వాళ్లు చేతులు కట్టుకుని నిలబడే పరిస్థితి ఉంది.

ఆ పరిస్థితిని ఇప్పుడు అధిగమించారు. ఎవరికి వాళ్లు వాళ్ల ఫైళ్లను తెలుగులో రాయడం మొదలు పెట్టారు.

ఇక్కడ ఇంకొక విషయం కూడా చెప్పాలి. ఇంగ్లీషు నుంచి తెలుగులో రాయమని అన్నప్పుడు ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో కృతకమైన ఒక శైలిలో

రాస్తుంటారు. తెచ్చిపెట్టుకున్న శైలి. అంటే అది అటు ఇంగ్లీషు కాదు ఇటు తెలుగు కాదు. అట్లా ఉంటుంది. అలా కాకుండా తెలుగులోనే ఆలోచించి తెలుగులోనే రాయడం వల్ల సహజమైన భాష వస్తుంది. ఇలాంటి ఫైళ్లు నాకు చాలా కనిపించాయి.

ఇట్లా తెలుగులో రాసిన ఫైళ్లు ఇంగ్లీషుకు ఏ మాత్రం తీసిపోవు కదా ఇంగ్లీషు కంటే కూడా చాలా బాగున్నాయనిపించింది.

పదకోశాలు తయారు చేసుకున్నాము

ఒక్కొక్క డిపార్టుమెంటులో మొత్తం పనిని విభజించుకున్నట్లయితే అది రెండు రకాలు ఉంటుంది.

డిపార్టుమెంటులో రొటీన్‌గా చేసే పని ఏమిటంటే రిపోర్టులు తెప్పిచ్చుకొనుట, పంపుట. ఇది రోజూ చేసే పని. ప్రతినెల లేక ప్రతివారం, ప్రతిరోజు జరిగేటటు వంటివి ఉంటాయి. ఇట్లాంటి వాటికి ప్రొఫార్మాలుంటాయి. నమూనాలు ఉంటాయి. స్టాండెడ్ ఫామ్స్ అంటాము. ఇవన్నీ తెలుగులో చేశాము.

దీంతో మూడింట ఒక వంతు పని పూర్తయ్యింది. ఇక రెండవ పని ఏమిటంటే పదకోశాలు తయారు చేసుకోవడం. పద కోశాలు ఒక్కొక్క డిపార్టుమెంటుకు ఒక్కొక్క పదాలు వాడుతారు. ఉదాహరణకు... భూగర్భ జల శాఖ వాడే పదాలు పశుపోషణ శాఖ వాళ్లు వాడరు. పశుపోషణ శాఖ వాళ్లు వాడే పదాలను వ్యవసాయ శాఖ వాళ్లు వాడరు. వ్యవసాయ శాఖ వాళ్లు వాడే పదాలను ఆరోగ్యశాఖ వాళ్లు వాడరు. ఆరోగ్యశాఖ వాళ్లు వాడే పదాలను గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) వాళ్లు వాడరు. ఎవరి పదాలు వాళ్లకుంటాయి.

అక్కడ వాళ్లు ఎక్కువగా వాడుకునే పదాలను దృష్టిలో పెట్టుకొని ఆ పదాలను ముందుకు తీసుకొచ్చి ఎవరికి వాళ్లు పదకోశాలు తయారు చేసుకున్నారు. ఇంకో విషయం... ఇచ్చేటటువంటి ప్రొసీడింగ్సు కూడా ఒక్కొక్క చోట ఒక మోడల్ ఉంటుంది. అవి కూడా ఒక స్టాండెడ్ ప్రొసీడింగ్స్ ఉంటాయి.

ఉదాహరణకు: నేను శాంక్షన్ ప్రొసీడింగ్స్ ఆఫ్ ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఒక ఐదు బోర్లు శాంక్షన్ చేస్తున్నాను. ఈ శాంక్షన్ ప్రొసీడింగ్స్ ఆంగ్లంలోనైనా తెలుగులోనైనా

ఒక క్రమం ఉంటుంది. ఆ క్రమంలోనే రాస్తాము. కాబట్టి ఇది ఒక సారి చేసుకుంటే వందసార్లు అయినా అదే రిపీట్ అవుతుంది.

ఇబ్బంది ఎక్కడొస్తుందీ... అసలు పరిపాలనలో సృజనాత్మకంగా భావుకతతో రాసేది చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల ఇది సమస్య కానేకాదు. పరిపాలనకు భావుకతకు కుదరదు. అందుకనే అధికారులు అలా ఉంటారు. అంటే భావకులు అయిన వారు అధికారులు కాలేకపోతారు. అధికారులు అయిన వారు భావకుడిగా ఉండటానికి యత్నించరు.

అట్లాంటివాటి నన్నింటిని స్టాండెడ్ ప్రొఫార్మాలు, స్టాండెడ్ ప్రొసీడింగ్స్ మొదలైనవి తయారుచేసుకున్నాము. ఆ తర్వాత పదకోశాలు తయారు చేసుకున్నాము. ఈ పదకోశాలు అధికారులు, సిబ్బంది అందరు కలిసి తయారుచేశారు.

అతి విచిత్రమైనది ఏమిటంటే... కార్యాలయాల పనులు ఒకరిద్దరి మీద ఆధారపడి నడవడం కాకుండా ఎక్కువ మంది పనిలో భాగస్వాములు అవుతున్నారు. అది ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది. తాము కూడా ఎవరికి తీసిపోము అనే ధైర్యం వాళ్లు పనిలో చూపించ గలుగుతున్నారు.

మరొక మంచి పరిణామం ఏందంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య మంచి సంబంధాలు ఏర్పడుతున్నాయి. తెలుగులో రాయాలి అన్న తపనతో ఒక శాఖ ఉద్యోగి మరొక శాఖ ఉద్యోగితో మాట్లాడి సలహాలు సూచనలు తీసుకుంటున్నారు. దీని వల్ల ఒక చక్కని వాతావరణం కార్యాలయాల్లో ఏర్పడింది. ఇది ఉద్యోగులు మరింత ఉత్సాహంతో పని చేయడానికి ఉపయోగపడుతుంది.

ఏ పనిలో అయినా ఎక్కువ మంది కోరుకుంటే తప్పకుండా విజయం వస్తుంది. మేము కూడా అదే చేశాము. సత్ఫలితాలను పొందాము.

ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ తెలుగులోనే...

ఇక పాలనా వ్యవహారాలన్నీ తెలుగులోనే సాగిస్తున్నాము. కోర్టు తీర్పులు అంటే పౌర సరఫరాల, రెవెన్యూ కోర్టు తీర్పులు కూడా తెలుగులోనే వెలువరిస్తున్నాము. ప్రజలు సౌకర్యవంతంగా అనుభూతి చెందుతున్నారు. సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ మంది ఎక్కువ ప్రయోజనం కలుగడమనేది లక్ష్యం.

పాలనా భాషగా తెలుగును తీసుకురావడం ప్రజలకు సంబంధించిన ఒక మౌలిక సదుపాయం.

అధికారులు ఎంతో చిత్తశుద్ధితో పనిచేశారు. ముఖ్యంగా కింది స్థాయిలో పనిచేసేవాళ్లు... గుమాస్తాలు, సూపరింటెండెంట్లు, టైపిస్టులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఎంతో సంతోషంగా పనిచేశారు.

తెలుగులో ఇవ్వడం వల్ల మేము తెలుసుకోగలుగుతున్నాము అని ప్రజలు జాయింట్ కలెక్టర్ తదితర అధికారుల దగ్గరకు వచ్చి చెపుతున్నారు.

మన వాళ్లు ఒక్కో సారి ఇచ్చిన రిపోర్టుల్లో తప్పులుంటే ప్రజలు చెపుతున్నారు. ఆ రిపోర్టు సరికాదు అని.

ఇది సామాన్యుల నుంచి వచ్చిన స్పందన.

ఇక దెబ్బతిన్న వాళ్లు 'మిడిల్‌మెన్'. మాకు వాళ్లు తెలుసు, వీళ్లు తెలుసు అని మీకు భాష రాదు అనీ ఇట్లా భయపెట్టి భయం మీద కొంత సంపాయించుకునే ఒక వర్గం వాళ్లు మాత్రం దెబ్బతిన్నరు.

రాజధానితో కూడా తెలుగులోనే...

హైదరాబాదు స్థాయిలో రాజధానితో పాలనా కార్యకలాపాలు కూడా తెలుగులోనే నిర్వహిస్తున్నాము.

హైదరాబాదులో ఉండే కార్యాలయాలు ఇవి.

1. శాఖాధిపతుల కార్యాలయాలు
2. సెక్రటేరియట్
3. రాజ్యాంగపరమైన సంస్థలు (హైకోర్టు, లోకాయుక్త)
4. చట్టపరమైన సంస్థలు(సమాచార హక్కు కమిషన్)

వీటిలో కూడా లోకాయుక్త వంటి వాటికి రిపోర్టులు తెలుగులోనే పంపుతున్నాము.

ప్రారంభంలో కొంచెం ఇబ్బంది అయినా కూడా నెమ్మది నెమ్మదిగా కుదుటపడుతున్నట్లు నాకు అనిపిస్తుంది. తొలుత ప్రసన్నంగా లేరు కానీ తర్వాత అలవాటు పడక తప్పదు.

ఇతర జిల్లా అధికారులు

పొరుగున ఉన్న జిల్లా అధికారులు కూడా తెలుసుకుంటున్నారు. కొంతమంది ని బృందాలుగా పంపించి అధ్యయనం చేస్తున్నారు. కొందరు వారు సొంతంగానే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. వాళ్లు కూడా పాలనలో తెలుగు భాషను అమలు చేస్తారని ఆశిస్తున్నాను. పక్క జిల్లా అధికారులు అభినందనలు తెలుపుతూ ఎలా అమలు చేస్తున్నారంటూ అడుగుతుంటారు. వారు కూడా ప్రయత్నం చేస్తున్నట్లు చెపుతున్నారు. కొంచెం సమయం పడుతుందని అంటున్నారు.

పాలనా భాషగా తెలుగు అంటే ఉత్తర ప్రత్యుత్తరాలు రెండు కార్యాలయాల మధ్య, లేదా వ్యక్తులు సంస్థలకు మధ్య, వ్యక్తులకు అధికారులకు మధ్య. సభలు సమావేశాలు తీర్మానాలు చర్చలు.

వీటికి సంబంధించి ప్రతి చట్టంలో కొన్ని ప్రజాస్వామికమైన ఏర్పాట్లు ఉంటాయి.

ప్రతి మూడు నెలలకు కలెక్టర్ అధ్యక్షతన సమావేశాలు ఉంటాయి. అధికారులు, అనధికారులు పాల్గొంటారు. అవన్నీ కూడా చురుగ్గా జరుగుతూ వాటిలో కార్యకలాపాలు కూడా తెలుగులో రాస్తాము.

జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం(డిడిఆర్‌సి)లో కూడా గత మూడు సార్లు తెలుగులోనే రాస్తున్నాము. దీని వల్ల మనం చేస్తున్న చర్చలు, మినిట్స్, మనం చేస్తున్న వాదోపవాదాలు తెలుగులో ప్రజల ముందు పెట్టగలుగుతున్నాము. దీని వల్ల పాలనా వ్యవహారాలు ప్రజలు సులభంగా తెలుసుకోగలుగు తున్నారు. వారికి బిడియం బెరుకు తగ్గుతుంది. ఫలితంగా ప్రజలకు పాలకులకు అంతరం తగ్గుతుంది.

అధికార భాషా సంఘం గుర్తించింది

ఆనవాయితీగా పాలనాభాష పురస్కారాలు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఇస్తారు. అది ఫిబ్రవరిలో ఇస్తారు. అధికార భాషాదినోత్సవాన్ని 'రాజ భాషా దినోత్సవం' అని హిందీ వాళ్లు జరుపుకుంటారు.

మనకు కూడా అధికార భాషా చట్టం అమలులోకి వచ్చిన రోజును అధికార భాషా దినోత్సవం అని జరిపారు. ఈ ఉత్సవాన్ని మొట్టమొదటి సారి మా జిల్లాలో జరిపారు.

మన నల్లగొండ జిల్లాలో ఈ ఉత్సవాలు జరపడానికి అధికార భాషా సంఘం వారే చెప్పిన విషయాలు ఏమిటంటే.... వాస్తవంగా ఎక్కడ విజయం జరుగుతుందో ఎక్కడ నిజంగా పాటించ బడుతుందో ఎక్కడ అమలు జరుగుతుందో ఎక్కడ విజయోత్సవం ఉందో అక్కడకు మనం వెళ్లి జరుపడం అనేది సముచితం అని చెప్పారు.

అక్కడ హైదరాబాదులో కూర్చొని... కొంత స్టేజీ డెకరేషను, ఒక బ్యాక్ గ్రౌండరు, నాలుగు పూలదండలు, కాసేపు ప్రశంసించడం. నలుగురి గురించి మాట్లాడడం... ఇది కాదు విజయోత్సవం జరుపాల్సిన తీరు. విజయం ఉన్న చోటనే జరుపడం సమంజసం అన్నారు. అందుకని నల్లగొండలో జరిపారు. ఇది మా జిల్లాకు గర్వకారణం.

అధికార భాష అమలు ఎలా జరుగుతుంది అని. అధికార భాషా సంఘం వాళ్లు చాలా సంతోషపడ్డారు. వాళ్లు ఏమన్నరంటే...

అధికార భాషా అమలు చట్టం వచ్చిన తర్వాత దాదాపు 47 సంవత్సరాల్లో ఎటువంటి పరిస్థితుల్లో కూడా మాకు ఆశ కనిపించలేదు. స్ఫూర్తి కనిపించని చోట

మొట్టమొదటి సారి మాకు ఆశ స్ఫూర్తి కనపడుతోంది. తక్కిన జిల్లాల్లో కూడా అమలుచేయమంటాము. వాళ్లు ఒకే విషయం అడుగుతున్నారు. ఒక జిల్లాలో సాధ్యమైంది ఇంకో జిల్లాలో ఎందుకు సాధ్యంకాదు. ఎక్కువ ఉండొచ్చు తక్కువ ఉండొచ్చు. కాని అసాధ్యమనేది ఉండదు కదా.

ఈ అధికార భాషాదినోత్సవం నల్లగొండలో జరుపడం మొదటిది. మాతృభాషా దినోత్సవం జరుపుకున్నాము కాని అధికార భాషాదినోత్సవం మనం ఇంతకు ముందు జరుపలేదు. అధికార భాషా అమలు చట్టం ఏర్పడిన తర్వాత మొట్ట మొదటి సారి నల్లగొండలోనే జరుపుకున్నాము.

మొదటిది నల్లగొండలో జరుపుకోవడం చరిత్రాత్మక సందర్భం. ఎందుకంటే ఏ నేల మీద విజయం వచ్చిందో ఆ నేల మీద నిలబడి మనం మాట్లాడడమనేది సంతోషిచవలసిన విషయం. ఇది నల్లగొండకు గర్వకారణం.



అధికార భాషా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న మండలి బుద్ధప్రసాద్, జిల్లా కలెక్టర్ నందివెలుగు ముక్తేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ హరిజవహర్‌లాల్, సబ్ కలెక్టర్ దివ్య దేవరాజన్

సువర్ణాక్షరాలతో రాయదగిన విజయం

నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ సమావేశ మందిరంలో జరిగిన అధికార భాషా దినోత్సవం సందర్భంగా అధికార భాషా సంఘం అధ్యక్షుడు ***శ్రీ మండలి బుద్ధప్రసాద్***

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 47 సంవత్సరాల తర్వాత మొట్టమొదటి సారిగా అధికార భాషాదినోత్సవ దినాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా ఒక వారం రోజులు (14-21 మే 2013) అధికార భాషా సదస్సులు, ఇష్టాగోష్ఠులు నిర్వహించాలని అలాగే బహుమతులు ఇవ్వాలని నిర్ణయించింది.

భారత ప్రభుత్వం రాజ్య భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. హిందీ అధికార భాషా సంఘం వాళ్లు దీన్ని నిర్వహిస్తున్నారు. మన తెలుగు నాట అలాంటి కార్యక్రమం ఇంత వరకు చేపట్టలేదు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆశీస్సులతో మొట్టమొదటి సారి ఈ అధికార భాషా వారోత్సవాలు జరుపుకుంటున్నాము.

సాధారణంగా ఇట్లాంటి ఉత్సవాలు హైదరాబాదులో నిర్వహించడం ఆనవాయితీ. నేను బాగా ఆలోచించాను. హైదరాబాదులోనే మరో చోటనో సమావేశం పెట్టడం కంటె తెలుగు విజయవంతంగా అమలు చేస్తున్న నల్లగొండకు వెళితేనే జాతికి ఒక దిశానిర్దేం చేసిన వాళ్లము అవుతాము అనిపించింది.

ఇక్కడ మనం చరిత్ర గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది. ఎంతో కష్టపడి తెలుగు వాళ్లకు ఒక రాష్ట్రాన్ని సాధించుకున్నాము. రాష్ట్రాన్ని అయితే సాధించుకున్నాము కాని లక్ష్యాన్ని మరిచిపోయాము. 1956లో రాష్ట్రం ఏర్పడితే 1966 వరకు కూడా మనం అధికార భాషా చట్టాన్ని తేలేకపోయాము. వావిలాల గోపాలకృష్ణయ్య కృషి వల్ల, నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, నాటి

విద్యామంత్రి పి.వి.నరసింహారావు ఈ అధికార భాషా చట్టాన్ని ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. 1966 మే 14వ తేదీన ఈ చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చారు.

అయితే ఆ తర్వాత మళ్లా మరిచిపోయారు. మళ్లా 1974లో జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా, మా నాన్న మండలి వెంకటకృష్ణారావు విద్యామంత్రిగా మొట్టమొదటి సారిగా తాలూకా స్థాయిలో తెలుగును ప్రవేశపెట్టారు. వావిలాల గోపాల కృష్ణయ్య అధ్యక్షతన అధికార భాషా సంఘాన్ని నియమించారు. అధికార భాషకు ఒక మంత్రిత్వ శాఖను ఏర్పరచి దానిని విద్యామంత్రిగా ఉన్న మా నాన్నగారికి అప్పగించారు.

1975లో ప్రపంచ తెలుగు మహా సభలు జరిగాయి. అప్పుడు జిల్లా స్థాయిలో అధికార భాషను అమలు చేయాలని భావించారు. ఆ తర్వాత ఎన్‌టి రామారావు ముఖ్యమంత్రి అయ్యాక అధికార భాషను అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ఇవ్వాళ ప్రభుత్వం కొత్తగా తేవాల్సిన చట్టాలు ఏమీ లేవు. మనం చట్టాలను చేశాము. కాని ఆ చట్టాలను మనం గౌరవించడం లేదు. అధికార భాషను అమలు చేయాలని అనేక ఉత్తర్వులు ఇచ్చాము. కాని ఆ ఉత్తర్వులు కాగితాలకే పరిమిత మయ్యాయి. ఇది చాలా దురదృష్టకరమైన పరిస్థితి.



జిల్లాలో తెలుగు భాష అమలును అధికార భాషా సంఘానికి వివరిస్తున్న జిల్లా కలెక్టర్ ముక్తేశ్వరరావు

ఇలాంటి పరిస్థితిలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రపంచ మహాసభలు తిరుపతిలో నిర్వహించారు. ఈ సభలకు అపూర్వ స్పందన గమనించిన తర్వాత మన బాధ్యత పెరిగింది. తెలుగును అన్ని రకాలుగా ప్రకాశింపజేయాలన్న దృఢ సంకల్పాన్ని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ఆ రకంగా పాత ఉత్తర్వులనే మళ్లా వెలికి తీసి అమలు చేయాలని చెప్పాము. దీనిని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే ప్రారంభించారు.

అయినా మేము ముందుకు సాగలేక పోతున్నాము. ఇవ్వాళ రాష్ట్ర స్థాయిలో అధికార భాష అమలు చేయడంలో మనం విఫలమవుతున్నందుకు విచారించాల్సి వస్తోంది.

అధికార భాషను అమలు చేయాలంటే మనసు కావాలి. ఆ మనసు నల్లగొండలో ఉన్నది కాబట్టే ఇక్కడ అమలవుతోంది. ఇవ్వాళ ఈ సభ నల్లగొండలో నిర్వహించడం తెలుగు జాతి చరిత్రలో అపూర్వమైన ఘట్టం.

నల్లగొండ జిల్లా అనేక ఉద్యమాలకు పుట్టినిల్లు. చాలా చైతన్యవంతమైన జిల్లా అలాంటి జిల్లా అధికార భాషా దినోత్సవానికి వేదిక అయినందుకు చరిత్రలో నిలిచి పోతుందని భావిస్తున్నాను.

మనసుంటే మార్గం ఉంటుందని పెద్దలు చెపుతారు. గొప్ప మనసుతో ఇక్కడ అధికారులు పనిచేశారు. గొప్ప ఆలోచనకు శ్రీకారం చుట్టడం చాలా సంతోషదాయకమైన విషయం. అందరినీ నేను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను.

ఇటీవల అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరిగినప్పుడు అందరు కలెక్టర్లకు ఉత్తరాలు రాశాను. మీ జిల్లాలో తెలుగును అమలు చేస్తున్న అధికారి పేరును సూచించండి. వారికి ప్రశంసాపత్రం, ఐదు వేల రూపాయల నగదు బహుమతిని అందిస్తాము అని.

చాలా మంది కలెక్టర్లు పేర్లు పంపించారు. కాని నల్లగొండ జిల్లా కలెక్టర్ ముక్తేశ్వరరావు నుంచి వచ్చిన లేఖ మాకు చాలా విభిన్నంగా కనిపించింది. మా జిల్లాలో అందరు అధికారులు తెలుగు అమలు చేస్తున్నారు. నేను ఏ ఒక్కరి పేరు పంపలేను అని రాశారు.

అప్పటి వరకు నాకు కూడా సంపూర్ణంగా విషయం అర్థం కాలేదు. తర్వాత తెలిసింది. ఇది గొప్ప విషయంగా నాకు అనిపించింది. కలెక్టర్ ముక్తేశ్వరరావు లాంటి దీక్షాదక్షుల వల్లనే ఇది సాధ్యమైందని అర్థం చేసుకున్నాను.

ఈ సందర్భంగా ఆయన నాతో చెప్పారు. కేవలం భాష మీద ప్రేమతో నేను అమలు చేయడం లేదు. సామాన్య ప్రజల భాషలో పరిపాలన చేయాలన్న మహోన్నత లక్ష్యంతో ఈ కార్యక్రమం చేశామని చెప్పారు.

మాతృభాషలో బోధన, మాతృభాషలో పాలన జరిగినప్పుడే మనం ప్రజలకు దగ్గర అవుతాము. ప్రజలకు తెలియని భాష పాలనలో ఉన్నంత కాలం ప్రజలకు సన్నిహితం కాలేము అన్నది అంగీకరించక తప్పదు.

ఇవ్వాళ ప్రభుత్వాన్ని ప్రజల హృదయంలోకి నల్లగొండ కలెక్టర్ తీసుకెళు తున్నారు. ఈ నల్లగొండను యావత్తు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా తీసుకోవలసిన



అధికార భాషా సంఘం అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా తెలుగు భాష అమలు చేస్తున్నందుకు గాను గౌరవ పురస్కారాన్ని అందుకుంటున్న జిల్లా కలెక్టర్ ముక్తేశ్వరరావు, హర్షం ప్రకటిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ హరిజవహర్‌లాల్, సబ్‌కలెక్టర్ దివ్య

అవసరముంది. అన్ని జిల్లాల కలెక్టర్లు ఇలా అధికార భాష అమలులో పోటీ పడితే రాష్ట్రం మొత్తం వర్ధిల్లుతుందని భావిస్తున్నాను.

అధికార భాషా అమలులో నల్లగొండ నమూనా. ఇది సత్యం.

నల్లగొండ కలెక్టర్ లేఖతో మేము ఆలోచించాము. మా తనిఖీ అధికారులు నల్లగొండ జిల్లాలో తెలుగు అమలవుతున్న తీరును పరిశీలించారు. తర్వాత నాకు ఫోన్ చేశారు. వాళ్లు ఫోన్ చేసి ఒకటే మాట అన్నారు. అధికార భాష అమల వుతున్న తీరును చూసి ఆనందంతో మా కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయండీ అని.

నూటికి నూరు శాతం తెలుగు అమలవుతున్న జిల్లాగా నల్లగొండ చరిత్రలో లిఖించబడుతుంది. ఇంతటి మహత్తర కృషి జిల్లాలో జరుగుతున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది.

అధికార భాషను అమలు చేయలేక పోతున్నామని మేము బాధపడుతున్న సమయంలో నల్లగొండ మాకు వెయ్యి ఏనుగుల బలం ఇచ్చింది. మాకు ఒక ధైర్యాన్ని ఇచ్చింది. మాట్లాడటానికి కూడా మాకు అవకాశమొచ్చింది. ఎవరితోనైనా నల్లగొండ జిల్లాను చూసి మాట్లాడండీ అని ధైర్యంగా గద్దించి మాట్లాడడానికి అవకాశమొచ్చింది.

ముఖ్యమంత్రితో జరిగిన సమీక్షా సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులను నల్లగొండకు పరిశీలించడానికి పంపించాలని కోరాను. ఇతర జిల్లా అధికారులు నల్లగొండను ప్రేరణగా తీసుకొని అమలు చేస్తే రాష్ట్రం మొత్తంలో తెలుగు అమలు విజయవంతమవుతుందని భావిస్తున్నాను.

భావితరాలు మన భాషకు, సంస్కృతికి దూరమవుతున్నాయి. కారణాలు అనేకం. ఈ నేపథ్యంలో మన భాషను, సంస్కృతిని రక్షించుకోవడానికి ఒక ప్రణాళికను తయారు చేశాము.

ఆ ప్రణాళిక అమలులోకి రాకముందే నల్లగొండ జిల్లా కలెక్టర్ ముక్తేశ్వరరావు అమలు చేశారు. భాషా పరిరక్షణ, సంస్కృతి పరిరక్షణ జిల్లాలో జరగడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఎంతో పట్టుదలతో ఇంతటి విజయాన్ని చేకూర్చిన జిల్లా అధికారులను, జిల్లా కలెక్టర్ ముక్తేశ్వరరావును అభినందిస్తున్నాను.

మా జిల్లాకు గర్వకారణం

మా జిల్లాలో పాలనా భాషగా తెలుగు అమలును అధికార భాషా సంఘం గుర్తించింది. ఇదే పద్ధతిలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో తెలుగును అమలు చేయాలని కాంక్షించింది. ఇందుకు గాను అన్ని జిల్లాల అధికారులకు నల్లగొండలో ఒక రోజు శిక్షణ ఇవ్వాలని తలపెట్టింది. మా జిల్లాలో శిక్షణ నిర్వహించాలని తలపెట్టడానికి కారణం తెలుగు విజయవంతంగా అమలవుతున్న జిల్లాలో శిక్షణ నిర్వహించడం సమంజసమని అధికార భాషా సంఘం భావించడమే.

ప్రతి జిల్లా నుంచి ఐదుగురు ముఖ్య అధికారులను శిక్షణా కార్యక్రమానికి వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసింది. అనుకున్నట్లుగానే ప్రతి జిల్లా నుంచి ఐదుగురు అధికారుల చొప్పున శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు.

నాకు తెలిసిన సమాచారం ప్రకారం ఈ సమావేశానికి అధికారులు రావడానికి ముందుగా అంత సుముఖంగా లేరు. తెలుగు భాష అమలుకు శిక్షణ ఏమిటని భావించారనుకుంటాను. మొత్తం మీద దాదాపు అన్ని జిల్లాల అధికారులు శిక్షణకు హాజరయ్యారు. ఆ కార్యక్రమానికి అధికార భాషా సంఘం అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్, ఇతర సంఘ సభ్యులు హాజరయ్యారు.

శిక్షణ కార్యక్రమానికి వచ్చిన అధికారులు ముందుగా మా జిల్లాలో తెలుగు అమలవుతున్న తీరును పరిశీలించారు. ఇందుకు గాను వివిధ శాఖల ఫైళ్లను వారికి అందుబాటులో ఉంచాము. ఆ అధికారులు మా అధికారులతో, సిబ్బందితో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు.

అనంతరం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇతర జిల్లాల అధికారులు వారు పరిశీలించిన అంశాలు, వాటిపై వారి అభిప్రాయాలను చక్కగా వ్యక్తీకరించారు. వారి అభిప్రాయాలు, సూచనలు మాకు కూడా ఎంతో ఉపయోగపడేలా ఉన్నాయి.

ఈ కార్యక్రమానికి వచ్చిన అధికారుల అభిప్రాయం ప్రకారం... ఆ అధికారులు చాలా వరకు తెలుగును సాహిత్య సంబంధ అంశంగా చూశారు. నల్లగొండ కలెక్టర్ సాహిత్య అభిమాని కాబట్టి తెలుగు అమలు చేస్తున్నారని భావించారు. పాలనా భాషగా తెలుగు అమలుకు ఇంత ప్రాధాన్యత ఇవ్వడమేమిటని కూడా భావించారు. కాని నల్లగొండ జిల్లాలో తెలుగు అమలును పరిశీలించిన తర్వాత వారికి ఉన్న తొలి అభిప్రాయాలను మార్చుకోక తప్పలేదు.

అదే అధికారులు సమావేశంలో వెలిబుచ్చిన అభిప్రాయాల ప్రకారం... భాష సాహిత్యానికి సంబంధించిన అంశం కాదు. భాష ప్రజలకు, ప్రభుత్వానికి వంతెన లాంటిది అని గ్రహించారు. పాలనా భాషగా తెలుగు ఉండడం వల్ల ప్రజలకు ప్రభుత్వానికి సాన్నిహిత్యం పెరుగుతుందనీ, ఇప్పటి వరకు ఉన్న అగాథాన్ని పూడ్చగలుగు తుందనీ విశ్వసించారు. ప్రజలకు మెరుగైన అభివృద్ధి ఫలాలు అందుతాయని భావించారు.



పదకోశం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్,
కలెక్టర్ ముక్తేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ హరిజవహర్‌లాల్,
అదనపు సంయుక్త కలెక్టర్ నీలకంఠం తదితరులు

మా నల్లగొండ జిల్లా శిక్షణకు హాజరైన అధికారులకు స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. తెలుగు భాష అమలు ఒక నిశ్శబ్ద విప్లవమని అభిప్రాయపడ్డారు. ఇది మాకు కూడా ప్రోత్సాహాన్ని ఇచ్చింది. మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి కావలసిన ఆత్మస్థైర్యాన్ని ఇచ్చింది. ఇటువంటి శిక్షణా కార్యక్రమం మా జిల్లాలో జరగడం మాకు గర్వకారణంగా భావిస్తున్నాము.

ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా అధికారులు రూపొందించిన పదకోశం పుస్తకాన్ని అధికార భాషా సంఘం అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఈ పదకోశం పుస్తకం కూడా శిక్షణకు హాజరైన అధికారులను ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు ఎంతో విలువైన సూచనలు చేశారు. పాలనా భాషగా తెలుగు అమలు మూన్నాళ్ల ముచ్చట కాకుండా చూడాలని కోరారు. వ్యవస్థాగతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అయితే దీనిపై మేము ఇంతకు ముందే ఏర్పాట్లు ప్రారంభించాము. వ్యక్తితో వచ్చి వ్యక్తితో పోకూడదని భావించాము. అందుకే వ్యవస్థాగతమైన ఏర్పాట్లు చేశాము. తెలుగు భాష అమలును పరిశీలించడానికి ప్రతి ప్రభుత్వ శాఖలో ఒక అధికారికి బాధ్యత అప్పగించాము. జిల్లా స్థాయిలో వీరందరిని సమన్వయ పరచడానికి మరో అధికారికి బాధ్యతలు అప్పగించాము. అంతిమంగా కలెక్టర్‌గా నేను పర్యవేక్షిస్తాను.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికార భాషా సంఘం అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ పలు సూచనలు చేశారు. వాటిని కూడా మేము దృష్టిలో పెట్టుకొని మరింత పటిష్టంగా అమలు చేయడానికి పూనుకుంటాము. పాలనా భాషగా తెలుగును అమలు చేసి నల్లగొండ జిల్లా మాకు వెయ్యి ఏనుగుల బలం ఇచ్చిందని అధికార భాషా సంఘం అధ్యక్షుడు అన్న మాటలు మాకు మరింత ప్రోత్సాహం ఇచ్చాయి.

పాలనా భాషగా తెలుగును అమలు చేస్తూ ఇతర జిల్లాలకు ప్రేరణ కలిగించగలిగి నందుకు మాకు ఆనందంగా ఉంది. అన్నింటి కంటే ముఖ్యం తెలుగు అమలును ప్రజలు స్వాగతిస్తున్న తీరు మాకు మరింత తృప్తిని కలిగిస్తున్నది.



డాక్టర్ హరిజవహర్‌లాల్
సంయుక్త కలెక్టర్

తెలుగులో రెవెన్యూ తీర్పులను ప్రజలు అర్థం చేసుకుంటున్నారు

రెవెన్యూ శాఖ అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తుంది. వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం అందించే సేవలను తెలుగు భాషలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో చేరవేయడంలో ముఖ్య భూమిక పోషిస్తుంది. మా శాఖ ముఖ్యంగా భూసంబంధిత వ్యవహారాలు, శాంతిభద్రతలు చూస్తుంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు కలిగే పంట నష్టం అంచనా వేసి పరిహారం ఇస్తుంది. రైతులకు పంట రుణాలను ఇప్పిస్తుంది.

భూమి క్రయ విక్రయాలకు సంబంధించిన దస్తావేజులు గతంలో వ్యవసాయుదారులకు అర్థమయ్యేవికావు. ఉర్దూ పదాలతో ఉండటం, వ్యవసాయకుంటుంబాలు విద్యావంతులు కాకపోవడం కారణాలు. ఇప్పుడు మేము తెలుగు పదకోశాలను తయారు చేశాము. భూ సంబంధ వివరాలను తెలుగులోనే అందిస్తున్నాము. కావున వ్యవసాయ కుటుంబాల వారు సులభంగా అర్థం చేసుకుంటున్నారు.

భూసమస్యలపై విచారణ చేసి తీర్పులను కూడా ప్రజల భాషలో ఇస్తున్నాము. ఈ తీర్పులను ప్రజలు సులభంగా అర్థం చేసుకుంటున్నారు.


ప్రజలకు అతి దగ్గరగా సేవలందిస్తున్న మరో శాఖ పౌరసరఫరాల శాఖ. ఈ శాఖ ద్వారా 'ప్రజా పంపిణీ విధానం' అమలు జరుగుతుంది. జిల్లాలోని పది లక్షల

కుటుంబాలకు గాను తొమ్మిదిన్నర లక్షల కుటుంబాలకు అతి తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులను అందిస్తున్నాము. అమ్మ హస్తం పథకం ద్వారా తొమ్మిది వస్తువులను 185 రూపాయలకే సరఫరా చేస్తున్నాము. దీనితో పాటు రైతు పండించిన పంటకు మద్దతు ధరను ఇప్పించడానికి కృషిచేస్తున్నాము.

ఈ వ్యవహారాలకు సంబంధించి తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహిస్తున్నాము. ప్రతి షాపు వద్ద తెలుగులో ధరల పట్టికను ఏర్పాటు చేశాము. ప్రజలు ఈ ధరలను సులభంగా అర్థం చేసుకుంటున్నారు.

నిత్యావసర వస్తువుల చట్టం 1955 కింద నమోదు అయ్యే కేసుల్లో తీర్పులను కూడా తెలుగులో అందిస్తున్నాము. ప్రజలకు ఇది ఎంతో సౌకర్యంగా ఉంది.

తెలుగులో పాలన సాగించడం వల్ల ప్రజలకు దగ్గర కాగలుగుతున్నాము. ఇది మాకు ఎంతో సంతృప్తినిస్తున్నది.



జె.పి. నీలకంఠం

అదనపు సంయుక్త కలెక్టర్

ప్రజలు ప్రభుత్వాన్ని అక్కున చేర్చుకుంటున్నారు

ప్రజల మాతృభాషలో పరిపాలన సాగించడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఇక్కడ తెలుగులో పాలన వల్ల అమ్మ దగ్గరకు పిల్లవాడు వచ్చినంత ఆనందంగా మా దగ్గరకు ప్రజలు వస్తున్నారు. వారికి న్యాయంగా కావలసిన పనులను అడిగి మరీ చేయించుకోగలుగుతున్నారు.

మహాభారతం కూడా తెలుగు భాషలో వచ్చాకనే ప్రజలు అక్కున చేర్చుకున్నారు. అలాగే తెలుగులో పాలనను కూడా ప్రజలు స్వాగతిస్తున్నారు.

తెలుగును అమలు చేయడం వల్ల ప్రభుత్వ పథకాలను ప్రజలు సులభంగా అర్థం చేసుకోగలుగుతున్నారు. ఉత్తర ప్రత్యుత్తరాలను కూడా తెలుగులోనే నిర్వహించడం వల్ల ఏ మాత్రం చదువు వచ్చిన వారైనా సొంతంగా అర్థం చేసుకుంటున్నారు. మరొకరి మీద ఆధారపడాల్సిన అవసరం తప్పింది.

ఇలా తెలుగు భాష అమలు చేయడం వల్ల మన సంస్కృతి, సంప్రదాయాల మీద మమకారం పెరుగుతుంది. ఇది సమాజానికి ఎంతో మేలు చేస్తుంది.

తెలుగులో పరిపాలన సాగించడానికి జిల్లా కలెక్టర్ చూపుతున్న శ్రద్ధ మాకు ఎంతో ప్రేరణ ఇస్తుంది. ప్రజలకు మేలు జరిగే పని చేస్తున్నందుకు మాకు ఆనందంగా ఉంది.

తెలుగు భాష వల్ల ప్రజలతో సాన్నిహిత్యం పెరిగింది



దివ్య దేవరాజన్
సబ్ కలెక్టర్
భువనగిరి

మాతృ భాషలో పాలన సాగించడం వల్ల ప్రజలు ప్రభుత్వానికి దగ్గర అవుతారు. ఇది నేను స్వీయ అనుభవంతో తెలుసుకున్నాను. ఎలాగంటే... నా మాతృభాష తమిళం. నేను ఇక్కడ ఉద్యోగంలో చేరిన ప్రారంభంలో చాలా ఇబ్బంది పడ్డాను. ఇక్కడ ప్రజలకు వారి మాతృభాష అయిన తెలుగు మాత్రమే వచ్చు. నాకు తమిళం, ఆంగ్లం వచ్చు. ఇలాంటి పరిస్థితిలో ప్రజల ఇబ్బందులను ఎలా అర్థం చేసుకుంటాను? ప్రజలు ఏమి చెపుతున్నారో నాకు అర్థం అయ్యేది కాదు. నేను ఏమి చెపుతున్నానో వారికి అర్థం అయ్యేది కాదు. ఇది నన్ను చాలా ఇబ్బందికి గురి చేసింది.

ఇదే సమయంలో జిల్లా కలెక్టర్ పాలనా భాషగా తెలుగును అమలు చేయాలని గట్టిగా తలపెట్టారు. ఇక నేను ఒక తెలుగు మాస్టర్‌తో ట్యూషన్ పెట్టించుకున్నాను. తెలుగు మాట్లాడటం, రాయడం నేర్చుకుంటున్నాను.

ప్రజలు ఇప్పుడు నా దగ్గరకు వచ్చి వారి సమస్యలను చెప్పుకుంటున్నారు. నేను కూడా ప్రజలతో తెలుగులో మాట్లాడుతున్నాను. దీని వల్ల నాకు ప్రజలతో సాన్నిహిత్యం పెరిగింది.



జె. రాజేశ్వరరెడ్డి
పథక సంచాలకులు
గ్రామీణాభివృద్ధి సంస్థ,
ఇందిరా క్రాంతి పథం

హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాలు

కలెక్టరు గారి ఆదేశం మేరకు డిఆర్‌డిఏ, ఐకేపీ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ కూడా తెలుగులో నిర్వహిస్తున్నాము. మాకు దాదాపు ఆరున్నర లక్షల మంది మహిళా సభ్యులు ఉన్నారు. 62 వేల సంఘాలు ఉన్నాయి. వాళ్లందరు కూడా పేదలు, నిరక్షరాస్యులు. వాళ్ల గురించి తప్పనిసరిగా మేము తెలుగులోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాము. వాళ్లు కూడా సులభంగా చదువుకొని అర్థం చేసుకుంటున్నారు. ఇతర సభ్యులకు చెప్పగలుగు తున్నారు. వాళ్లు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కిందిస్థాయి సిబ్బంది కూడా బాగా సహకరిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి నుంచి వచ్చే ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా తెలుగులోనే వస్తే మేము ఇంకా బాగా తెలుగును అమలు చేయడానికి వీలవుతుంది. అలాగే ప్రతి శాఖకు ఒక వెబ్‌సైట్ ఉంటుంది. ఈ వెబ్‌సైట్‌ను ఆంగ్లంలో నిర్వహిస్తున్నారు. ఇవి కూడా తెలుగులో నిర్వహిస్తే మరింత బాగుంటుంది.




వి. కోటేశ్వరరావు
పథక సంచాలకులు
జిల్లా నీటి యాజమాన్య సంస్థ

గ్రామీణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

మనం తెలుగులో మాట్లాడుతున్నాము కదా. మరి ఆంగ్లంలో రాయడం మాత్రం ఎందుకు. దీని వల్ల ప్రజలకు ఇబ్బందే కలుగుతుంది. కలెక్టర్ గారి ప్రోత్సాహంతో మేము కూడా తెలుగులోనే ఉత్తరప్రత్యుత్తరాలు నిర్వహిస్తున్నాము. మాకు అర్జీలు తెలుగులోనే వస్తున్నాయి. వారికి సమాధానం కూడా తెలుగులోనే ఇవ్వడం అవసరం ధర్మం అని భావిస్తున్నాను.

తెలుగును మరింత బాగా అమలు చేయడానికి మేము పదకోశాలు తయారు చేసుకున్నాము. స్టాండెడ్ ప్రొఫార్మాలు కూడా తెలుగులో తయారు చేసుకున్నాము. తెలుగులో ప్రజలకు సమాధానాలు ఇవ్వడం వల్ల వాళ్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది కూడా ఎంతో సహకరిస్తున్నారు. చక్కగా తెలుగులో రాస్తున్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన తెలుగు భాషను జిల్లాలో అమలు చేస్తున్నందుకు మాకు కూడా సంతోషంగా ఉంది.

యువత సులభంగా అర్థం చేసుకుంటున్నారు



ఆర్. అంజయ్య
ముఖ్య కార్యనిర్వాహణాధికారి
స్టెప్

కలెక్టర్ గారి ఆదేశాలు, ప్రోత్సాహంతో తెలుగులో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాము. మాకు గ్రామీణ యువత నుంచి అనేక వినతులు తెలుగులో వస్తాయి. వారితో ఆంగ్లంలో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపడం అన్యాయమని పించింది. అందుకని తెలుగులోనే నిర్వహిస్తున్నాము. కలెక్టరు గారు అర్జీదారులకు తెలుగులోనే సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. యువతతోగాని ప్రజలతోగాని, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతోగాని తెలుగులోనే వ్యవహారాలు నిర్వహిస్తున్నాము.

మేమిచ్చే సమాచారం యువతకు సులభంగా అర్థమవుతున్నది. అందుకని వారికి న్యాయంగా దక్కాల్సిన దానిని అడగగలుగు తున్నారు. వారి పనిని సులభంగా చేసుకో గలుగు తున్నారు. తెలుగులో ఉత్తరప్రత్యుత్తరాలు నిర్వహించడం వల్ల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మాకు కూడా ఎంతో సంతృప్తికరంగా ఉంది.



ఎం. మోహన్‌రావు
ఉప సంచాలకులు
ముఖ్యప్రణాళికాధికారి
కార్యాలయం

ఎడారిలో ఒయాసిస్సు తెలుగు

మా ప్రణాళిక శాఖ అన్ని శాఖలకంటే భిన్నమైనది. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలను మా శాఖ పర్యవేక్షణ చేస్తుంది. ఇంతకు ముందు పథకాల అమలుకు సంబంధించిన సంపూర్ణ అవగాహన కింది స్థాయి అధికారులకు ఉండేది కాదు. అవగాహన లోపం వల్ల నిధులు కూడా పూర్తిగా వినియోగించేవారు కాదు. 70,80 శాతం మాత్రమే వినియోగించేవారు. కారణం ఆంగ్ల భాషలో పాలనా వ్యవహారాలు నిర్వహించడం.

కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. తెలుగులో పాలనా వ్యవహారాలు నిర్వహించడం వలన కింది స్థాయి అధికారులు సులభంగా అర్థం చేసుకోగలుగు తున్నారు. పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. తెలుగును అర్థం చేసుకుంటున్నారు కాబట్టి పై అధికారుల నుంచి వచ్చే నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నారు. ఆత్మస్థైర్యంతో పనిచేస్తున్నారు. కలెక్టర్ కేవలం అధికారిగా కాకుండా మంచి టీం లీడరుగా మాకు మార్గనిర్దేశం చేస్తున్నారు.



ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న అధికార భాషా సంఘం అధ్యక్షులు శ్రీ మండలి బుద్ధప్రసాద్, ఎడమ నుండి కుడికి అదనపు సంయుక్త కలెక్టర్ శ్రీ జి.పి. నీలకంఠం, కలెక్టర్ శ్రీ ఎన్. ముక్తేశ్వరరావు ఐ.ఎ.ఎస్. అధికార భాషా సంఘం సభ్యులు డా॥ టి. గౌరీశంకర్



Nalgonda Namūna
Pālanā Bhāshagā Telugu

Nandivelugu Mukteswara Rao, I.A.S.
Dist. Collector, Nalgonda.

ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా 'ప్రజల భాషలోనే పాలన' అన్నది చరిత్ర చెపుతున్న సత్యం. పూర్వం మన దేశంలో సంస్కృత, ప్రాకృత భాషలు రాజ భాషలుగా చెలామణిలో ఉన్నప్పుడు కూడా పాలకులు దేశ భాషల్లోనే ప్రజలతో నిత్యవ్యవహారాలు జరిపినట్లు చారిత్రకాధారాలున్నాయి. ప్రస్తుతం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది అనివార్యమైన అంశంగా గుర్తించబడింది. నల్లగొండ జిల్లాలో పూర్తి స్థాయిలో పాలనా భాషగా తెలుగు అమలు అవుతున్నందుకు సంతోషంగా ఉంది. ఇక్కడ తెలుగు ఇంత బాగా అమలు కావడానికి కలెక్టర్ నందివెలుగు ముక్తేశ్వరరావు ఒక చోదక శక్తిగా పని చేశారు.

- మండలి బుద్ధప్రసాద్